అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వైద్య పరికరాల నివేదికలు పంపించాలి

ఖిలావరంగల్, సెప్టెంబర్ 20: ఎంజీఎం దవాఖానకు కావాల్సిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వైద్య పరికరాల వివరాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన చాంబర్‌లో శుక్రవారం ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్ఎంవో మురళి, ప్రవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమ్మయ్యతో పలు అంశాలపై సమీక్షించారు. అత్యాధునిక పరికాలు అందించేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చిందన్నారు. ఈ సందర్భంగా గ్రిడ్ ప్రతినిధులను ఆమె అభినందించారు. సమీక్షలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, పవర్‌గ్రిడ్ జూనియర్ ఇంజినీర్ సంపత్ పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర 'యువ టూరిజం క్లబ్' ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్కో గ్రూప్‌నకు 25 మంది విద్యార్థులతోపాటు ఇద్దరు టీచర్లను ఎంపిక చేయాలని సూచించారు. Https://tourism.gov.in/clubలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కరీమాబాద్, సెప్టెంబర్ 20: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. మామునూరులోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో డెంగ్యూ సోకిన సిబ్బందిని శుక్రవారం కలిసి పలు సూచనలు చేశారు. ఇంటి ఆవరణల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిందన్నారు. సిబ్బంది నిత్యం గ్రామాలను పర్యవేక్షిస్తూ ప్రజలకు జ్వర పరీక్షలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజలు వేడిచేసి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో పీటీసీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నల్లబెల్లి/వర్ధన్నపేట/రాయపర్తి, సెప్టెంబర్ 20: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ధర్మేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నల్లబెల్లి ఎంపీడీవో నరసింహమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. అలాగే, గ్రామాల్లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు అడ్డరాజు, భట్టు సాంబయ్య ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వర్ధన్నపేట మండలంలోని కార్యదర్శులు ఎంపీడీవో వెంకటరమణకు వినతిపత్రం ఇచ్చారు. రాయపర్తి మండలంలోని 40 జీపీల్లో పని చేస్తున్న కార్యదర్శులు ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, ఎంపీవో కూచన ప్రకాశ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు.

భూగర్భ డ్రైనేజీపై డీపీఆర్ రూపొందించాలి

వరంగల్, సెప్టెంబర్ 20: గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ, వరద నీటి పారుదల వ్యవస్థపై డీపీఆర్‌లు రూపొందించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం డీపీఆర్ రూపొందించేందుకు కన్సల్టెన్సీని ఆహ్వానించామన్నారు. త్వరలోనే ఉన్నతాధికారులు, స్టేక్ హోల్డర్లను భాగస్వామ్యం చేస్తూ సమావేశం నిర్వహిస్తామన్నారు.

గ్రామగ్రామానా 'స్వచ్ఛత' ప్రతిజ్ఞ

- పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు
- మల్టీ పర్పస్ కార్మికుల కాళ్లు కడుగుదాం
- డీఆర్డీవో కౌసల్యాదేవి
- నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలి
- డీఎల్పీవో రాజీవ్‌కుమార్

గీసుగొండ/నల్లబెల్లి/ఖిలావరంగల్/వర్ధన్నపేట/చెన్నారావుపేట/సంగెం/దుగ్గొండి/పోచమ్మమైదాన్/పర్వతగిరి/రాయపర్తి, సెప్టెంబర్ 20: స్వచ్ఛత హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా గ్రామగ్రామానా అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో భాగంగా గీసుగొండ మండలంలోని ఊకల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మల్టీపర్పస్

వర్ధన్నపేట: ఇల్లందలో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు, అధికారులు

గీసుగొండ : మల్టీపర్పస్ కార్మికులతో మాట్లాడుతున్న డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి

కార్మికులతో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే మల్టీపర్పస్ వర్కర్ల కాళ్లు కడుగుదామని పిలుపునిచ్చారు. అనంతరం విలేజ్ మ్యాప్‌ను పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గీసుగొండలో ర్యాలీ నిర్వహించారు. డీఎల్పీవో రాజీవ్‌కుమార్ నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం, మామిండ్లవీరయ్యపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, నర్సరీలు, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు జీపీ సిబ్బంది రోజూ పారిశుధ్య పనులు చేయాలని సూచించారు. వరంగల్ శివనగర్‌లో ఏకశిలా డీజీ హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ తీసి, మానవహారం నిర్వహించారు. వర్ధన్నపేటతోపాటుగా ఇల్లందలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీలు, మానవహారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇల్లంద ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంపీడీవో శ్రీమతి వెంకటరమణ అవగాహన కల్పించారు. చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌లో ఎంపీడీవో శ్రీవాణి స్వచ్ఛత హీ కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని తెలియజేశారు. సంగెం మండలం కృష్ణానగర్‌లో ఎంపీడీవో కాసర్ల రవీందర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దుగ్గొండి మండలం గిర్నిబావిలోని ఎంజేపీటీలో ఎంపీడీవో లెక్కల అరుంధతి విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి ఉన్నత పాఠశాలలో గ్రేటర్ కార్పొరేషన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ధరమ్‌సింగ్ పరిశుభ్రతపై పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో మాలోత్ శంకర్ నేతృత్వంలో ప్రమాణం చేయించారు. రాయపర్తిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్‌నాయక్, ఎంపీవో ప్రకాశ్ విద్యార్థులు, గురుకుల సిబ్బందితో కలిసి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలపై ప్రతిజ్ఞ చేసి మానవహారం చేపట్టారు.

కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మార్కెట్ కార్యదర్శి నిర్మల

ఎనుమాములలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

కాశీబుగ్గ, సెప్టెంబర్ 20: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం కొత్త పత్తి కొనుగోళ్లను శుక్రవారం మార్కెట్ కమిటీ ఉన్న తశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ప్రతినిధులు, కాటన్, అడ్డి వ్యాపారులు, మార్కెట్ కమిటీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

'పేరు తొలగించడం అవివేకం'

నల్లబెల్లి, సెప్టెంబర్ 20: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం రాష్ట్ర ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమని ఆర్యవైశ్య మహాసభ జిల్లా నాయకుడు గందె శ్రీనివాస్ గుప్తా అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిందిపోయి తెలుగుజాతి ఐక్యతను దెబ్బతీసేందుకు రేవంత్ సర్కార్ యత్నించడం సరికాదన్నారు. అక్టోబర్ 4న రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరండం ఇవ్వనున్నట్లు తెలిపారు.

పాకాలలో వన్యప్రాణుల వివరాల సేకరణ

ఖానాపురం, సెప్టెంబర్ 20: పాకాల అటవీ ప్రాంతంలో జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు చేపట్టిన జంతు వివరాల సేకరణ రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా జులాజికల్ శాస్త్రవేత్తల బృందం సభ్యులు ఎస్.ఎస్ జాదవ్, నరేశ్, శివశంకర్, భరత్, సోమేశ్ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్ర వరకు పాకాల అడవుల్లో తిరిగి వన్యప్రాణుల వివరాలు సేకరించారు. 300లకు పైగా జీవ జాతులను సేకరించి కెమికల్స్‌తో కూడిన బాటిళ్లలో భద్రపరిచారు. అదేవిధంగా పెద్ద జంతువులు, పక్షు జాతులను 200 వరకు గుర్తించినట్లు తెలిపారు. మరో రెండు రోజులపాటు సర్వే నిర్వహిస్తామన్నారు.

25 నుంచి కాజీపేటలో పలు రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

కాజీపేట, సెప్టెంబర్ 20: కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో బైపాస్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ ఇంజినీరింగ్ పనుల వల్ల ఈ నెల 25 నుంచి ఐదురోజుల పాటు పలు రైళ్లకు కాజీపేట రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే, వరంగల్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్టింగ్‌ను ఈ నెల 25 నుంచి 29 వరకు ఎత్తివేశారు.

కుడా అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

వరంగల్, సెప్టెంబర్ 20: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పద్మాక్షి ఆలయానికి వెళ్లే అప్రోచ్ రోడ్డు, సరిగమ పార్కు, భద్రకాళీ బండ్, మ్యూజికల్ గార్డెన్, భద్రకాళీ ఆలయ మాడ వీధుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆరెపల్లి, పైడిపల్లికి చెందిన ఇన్నర్ రింగ్‌రోడ్డు బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ కుడా కార్యాలయంలో చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 20: వరంగల్ దేశాయిపేట సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ అజయ్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ సందర్భంగా రెండు గంటలపాటు ఎల్‌బీనగర్, నర్సంపేట రోడ్డు, దేశాయిపేట, బాలాజీనగర్, లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఒకరిపై వైల్డ్ లైఫ్ కేసు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 20: నాగుపాములను అక్రమంగా కలిగి ఉండి, వాటి దంతాలను తీయడంతోపాటు వాటి ద్వారా వరంగల్ బస్టాండ్ సమీపంలో షో చేస్తూ డబ్బులు సంపాదిస్తున్న రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన సయాద్ యాకూబ్‌పై అటవీ శాఖ అధికారులు మంగళవారం వైల్డ్ లైఫ్ కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సందీప్ తెలిపారు. అటవీ చట్టాలను ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్

రాయపర్తి, సెప్టెంబర్ 20: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలచారి తెలిపారు. మండలంలోని 40 జీపీల పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి సృజన్‌తేజ

సంగెం/నెక్కొండ/పర్వతగిరి/రాయపర్తి, సెప్టెంబర్ 20: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సృజన్‌తేజ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం మండలస్థాయి ప్రాథమిక లెవల్ స్కూల్ కాంప్లెక్స్, యూపీఎస్ లెవల్ బయోసైన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన్‌తేజ మాట్లాడుతూ నవంబర్‌లో జరిగే ఎన్ఏఎస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. రోజూ ఎఫ్ ఆర్ఎస్ అప్ ద్వారా హాజరు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. అలాగే, నెక్కొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సృజన్‌తేజ తనిఖీ చేశారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంతేకాకుండా ఆయన పర్వతగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. రాయపర్తిలోని జడ్పీహెచ్ఎస్‌లో మండల పరిధిలోని పీఎస్, ఎంపీపీఎస్‌ల హెచ్ఎస్‌లు, ఉపాధ్యాయులకు 'విద్యార్థుల్లో అభ్యసనా స్థాయిల పెంపు-ఉపాధ్యాయుల కృషి' అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఈబీ కార్యదర్శి గారె కృష్ణమూర్తి హాజరై మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో బోధనోపకరణాలు తయారు చేసి, విద్యార్థులకు బోధించాలని సూచిచారు.

రసాభాసగా పీఏసీఎస్ వార్షిక మహాసభ

స్థల విరాళ పత్రాలు చూపిస్తున్న చెన్నారాడ్డి

చెన్నారావుపేట, సెప్టెంబర్ 20: చెన్నారావుపేట సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైర్మన్ సత్యనారాయణరెడ్డి కోరారు. మండలకేంద్రంలోని సహకార సంఘం ఆవరణలో చైర్మన్ అధ్యక్షతన 67వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త రుణాలు అందించడంలో, జల్లి గోదాముల నిర్మాణంపై పలువురు రైతులు పాలకవర్గాన్ని ప్రశ్నించడంతో సమావేశం రసాభాసగా మారింది. అనంతరం మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి మాట్లాడుతూ జల్లి గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో గోదాములు నిర్మించాలన్నారు. ఇందు కోసం ప్రైవేట్ భూములు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. తాను స్థలాన్ని విరాళంగా ఇస్తానని చెప్పి వెంటనే పేపర్‌పై రాసి సంతకం చేసి చైర్మన్‌కు అందించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, సొసైటీలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, సీఈవో బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్న అధికారులు

చెరువు గండికి మరమ్మతు

'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

రాయపర్తి, సెప్టెంబర్ 20: మండలకేంద్రంలోని రామచంద్రుని చెరువు మత్తడి కింది భాగంలో పడిన గండికి శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేయించారు. 'అయ్యో.. రామచంద్ర' శీర్షికన ఈ నెల 16న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. గండి, బుంగల వద్ద మొరం పోయించారు. ఆయకట్టు రైతులు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

వర్ధన్నపేట సెప్టెంబర్ 20: వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ పరిధిలోని కోనాపురం కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏఈ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు మనోజ్, అజయ్, అశోక్, నరేందర్, ప్రదీప్, యాకయ్య, నిఖిల్ పాల్గొన్నారు.

'ట్రస్ట్ భూములను కాపాడాలి'

రాయపర్తి, సెప్టెంబర్ 20: కిష్టాపురం క్రాస్‌రోడ్డు-కాట్రపల్లి ప్రధాన రహదారిలోని జీయర్ ఎడ్యూకేషన్ ట్రస్ట్‌కు విరాళంగా అందజేసిన భూములను కాపాడాలని కిష్టాపురం, మొరిపిరాల, పన్యానాయక్‌తండా, వాంకుడోతుతండా వాసులు కోరారు. పలు సంఘాల ప్రతినిధులు, గ్రామాల పెద్దలు శుక్రవారం తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

జోరు వాన.. కరెంట్ కట్

గీసుగొండ, సెప్టెంబర్ 20: మండలంలో శుక్రవారం రాత్రి జోరు వాన కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో మచ్చాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కొమ్మాల, విశ్వనాథపురం, మచ్చాపురం, నందనాయక్ తండాతోపాటు మరో ఐదు గ్రామాలకు అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

కిచెన్ గార్డెన్‌లో కూరగాయలు

గీసుగొండ, సెప్టెంబర్ 20: మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌లో కూరగాయలు కోతకు వచ్చాయి. శుక్రవారం ఉపాధ్యాయులు బెండకాయలను తెంపి మధ్యాహ్న భోజన కార్మికులకు అందించారు. వారు కూర వండి విద్యార్థులు వడ్డించారు. హెచ్ఎం పట్టాభి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు బెండకాయలు అందజేస్తున్న టీచర్లు

'డిగ్రీ కళాశాలకు భవనం నిర్మించాలి'

వర్ధన్నపేట, సెప్టెంబర్ 20: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి భవనం నిర్మించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వర్ధన్నపేట జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు.

ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీగా సారంగపాణి

గిర్మాజీపేట, సెప్టెంబర్ 20: లక్నేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు సోనబోయిన సారంగపాణిని జిల్లా స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) సెక్రటరీగా నియమించినట్లు డీఈవో జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా సారంగపాణికి శుక్రవారం డీఈవో నియామకపత్రం అందజేశారు.

డివిజన్‌లో సమస్యల పరిశీలన

కరీమాబాద్, సెప్టెంబర్ 20: డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టిన నేపథ్యంలో శుక్రవారం బల్దియా అధికారులు డివిజన్‌లో సమస్యలను పరిశీలించినట్లు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల రవి తెలిపారు. కమిషనర్ స్పందించి సమస్యల పరిశీలనకు అధికారులను పంపారన్నారు. సమస్యలను వారికి వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ముజామిల్, సిబ్బంది పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

నల్లబెల్లి, సెప్టెంబర్ 20: గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ ఉద్యమకారుడు భట్టు సాంబయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని మండలకేంద్రంలోని సబ్‌పోస్టాఫీస్‌లో పోస్టు చేశారు. ఐదు నెలలుగా వేతనాలు లేక మల్టీపర్పస్ వర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

పోచమ్మమైదాన్/చెన్నారావుపేట/దుగ్గొండి/ఖిలావరంగల్, సెప్టెంబర్ 20: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. పోషణమాసంలో భాగంగా చిరుధాన్యాలు, కూరగాయలపై వరంగల్ కొత్తవాడ, ఆటోనగర్‌లోని ప్రభుత్వ గిర్మాజీపేట పాఠశాల, చెన్నారావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దుగ్గొండిలో, శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అధికారులు కిశోర బాలికల పోషణపై అవగాహన కల్పించారు.

మహిళా కౌలు రైతు మృతికి

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు చెల్లించాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేటరూరల్, సెప్టెంబర్ 20: గిరిజన మహిళా కౌలు రైతు మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. నర్సంపేట మండలం రాజుపేట పరిధిలోని గార్లగడ్డతండాకు చెందిన గిరిజన మహిళా రైతు పాల్తియ భద్రమ్మ ఇదే తండాకు చెందిన నూనె సదయ్య వద్ద ఏడెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నదన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పెట్టుబడి నష్టపోయి, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. పంట నష్టంపై అధికారులు సర్వే చేసి రైతులకు మనోధైర్యం కల్పించి ఉంటే ఈరోజు ఆమె ఆత్మహత్య చేసుకునేది కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి పంట నష్టాన్ని అంచనా వేసి రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటనలు కౌలు రైతులపై పరస్పర విరుద్ధంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రైతులకు భరోసా కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని పెద్ది ధైర్యం చెప్పారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- రూ. 10 లక్షలు, రెండెకరాల భూమి తేవాలని అత్త టార్చర్
- మృతురాలు 8 నెలల గర్భిణి

ప్రవళిక మృతదేహం

దుగ్గొండి, సెప్టెంబర్ 20: వారు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. నిండు నూరేళ్లు కలిసి ఉంటానని ఏడడుగులు వేసిన ఆ యువతిని వరకట్న పిశాచి మూడేళ్లకే బలి తీసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని శంబయ్యపల్లికి చెందిన కొల్లూరి రమ-చందర్‌రావు దంపతుల కుమార్తె ప్రవళిక(22) మూడేళ్ల క్రితం వెంకటపురం గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సందీప్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి రెండేళ్ల బాలుడు ఉన్నాడు. రెండేళ్ల వరకు అన్యోన్యంగా ఉన్నారు. ఈ క్రమంలో సందీప్ తల్లి విజయ రూ. 10 లక్షల నగదు, రెండెకరాల పొలాన్ని కట్నంగా తేవాలని రెండేళ్ల నుంచి వేధిస్తోంది. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా వేధింపులు ఆపలేదు. ప్రస్తుతం ప్రవళిక 8 నెలల గర్భిణి. అత్త వేధింపులు తాళలేక ప్రవళిక ఈ నెల 18న తల్లిగారి ఇంటి వద్ద గడ్డిమందు తాగింది. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆపరేషన్ చేసి శిశువుకు పురుడు పోశారు. కానీ, చికిత్స పొందుతూ తల్లితోపాటు శిశువు మృతి చెందారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు విజయ, సందీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యమకారుడు సారంగపాణి మృతి